# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఒక్కో కుటుంబానికి 15 వేల రూపాయలు ఆదా అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌కి గూగుల్ డేటా సెంటర్ రావడం గర్వకారణమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**

3. **నంద్యాల జిల్లా శ్రీశైలంలో రేపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.**

4. **ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.**

5. **భారత రత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం జయంతి ఈరోజు.**

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నంద్యాల, కర్నూలు జిల్లాల మంత్రులతో ఈరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి పాల్గొనే సూపర్ జీఎస్టీ –సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఒక్కో కుటుంబానికి 15వేల రూపాయలు ఆదా అవుతుందని పేర్కొన్నారు. రేపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 13వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని ముఖ్యమంత్రి తెలిపారు. కర్నూలులో జీఎస్టీపై జరిగే బహిరంగ సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని వివరించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌కి గూగుల్ డేటా సెంటర్ రావడం గర్వకారణమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని మంత్రి నివాసంలో పాత్రికేయుల సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతగానో కృషి చేశారని వివరించారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వల్ల సుమారు లక్షా 80 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని మంత్రి నారా లోకేష్ వెల్లడిస్తూ...

వాయిస్..30 సెకన్లు

---------------------------

నంద్యాల జిల్లా శ్రీశైలంలో రేపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. శ్రీశైలానికి అటవీ భూముల వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను త్వరలోనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొంటూ...

వాయిస్.. 27 సెకన్లు

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వీటిని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 16 లక్షల 51 వేల 271 మంది పిల్లల బయోమెట్రిక్‌లను నవీకరించేందుకు విద్యాశాఖ యూఐడీఏఐ సమన్వయంతో ఈ క్యాంపులు ఏర్పాటు చేస్తోందని చెప్పారు.

---------------------------

భారత రత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం జయంతి ఈ రోజు. 1931 అక్టోబరు 15న ఆయన తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారు. భౌతిక, అంతరిక్ష శాస్త్రాలను అభ్యసించారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థలలో పని చేసి భారత దేశ పౌర అంతరిక్ష కార్యక్రమం, సైనిక క్షిపణి అభివృద్ధికి కృషి చేశారు.

బాలిస్టిక్ క్షిపణి, ప్రయోగ వాహన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిపై చేసిన కృషికి భారతదేశ మిస్సైల్ మెన్‌గా పేరు పొందారు. 1998లో భారతదేశం పోఖ్రాన్–II అణు పరీక్షలలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. 2002 నుంచి 2007 వరకూ ఆయన భారతదేశ 11వ రాష్ట్రపతిగా పని చేశారు. దేశానికి ఆయన అందించిన సేవలకు గాను భారతరత్న అవార్డు అందుకున్నారు.

డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయనకు నివాళులర్పించారు.

---------------------------

గూగుల్ సెంటర్ ఏర్పాటుతో విశాఖపట్నం విశ్వనగరంగా ఎదిగేందుకు మరో అడుగు ముందుకు పడిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ సంస్థ విశాఖపట్నంలో హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖపట్నం గేమ్ చేంజర్‌గా మారబోతోందని ఆయన పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి ఈ కొత్త సాంకేతికత ఉపయోగపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

---------------------------

సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రేపటి నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 'ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్'ను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార పదార్థాల తయారీ సంస్థల సహకారంతో 60 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. షాపింగ్ ఫెస్టివల్‌లో భాగంగా వస్తు

సేవల పన్ను – జీఎస్టీపై అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

----------------------------

పౌష్టికాహారం ఆరోగ్యవంతమైన జీవితానికి సోపానమని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జాతీయ పోషకాహార మాసోత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శనను కలెక్టర్ నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోషకాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి చిన్నారికి అంగన్ వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు వెల్లడించారు.

----------------------------

చిత్తూరు జిల్లాలో 31 వేల 929 మంది మామిడి రైతుల ఖాతాలకు 146 కోట్ల 84 లక్షల రూపాయల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన నిన్న పాత్రికేయులతో మట్లాడుతూ.. మామిడి ధరలు తగ్గడంతో రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం కిలోకు 4 రూపాయల మద్ధతు ధర ప్రకటించిందన్నారు. 3 లక్షల 67 టన్నుల మామిడికి 146 కోట్ల 84 లక్షల రూపాయలను నేరుగా రైతుల ఖాతాలకు జమ చేసినట్లు కలెక్టర్ వివరించారు.

----------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో శ్రీశైలంలో రహదారి రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా రేపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీశైలం వైపు వెళ్లే వాహన రాకపోకలను తాత్కాలికంగా దారి మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వైపు ప్రయాణించే భక్తులు, అలాగే దోర్నాల మార్గం ద్వారా శ్రీశైలం చేరుకునే యాత్రికులు తమ పర్యటన ప్రణాళికలను తగిన విధంగా సవరించుకోవాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన అనంతరం సాధారణ వాహన రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో... రాష్ట్రంలో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

..వాయిస్.. 30 సెకన్లు

======================